క్లుప్తంగా

బరకసంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు



మిడుతూరు: రోళ్ల పాడు అభయార ణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి వారికి సోమవారం అమావాస్య సందర్భంగా స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలను పురోహితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో మన్యసుక్త హోమం, స్వామివార్లకు పల్లకీ సేవ కార్యక్రమం భక్తజనుల మధ్య నిర్వహించారు. రేగడగూడూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

జూపాడుబంగ్లా: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో సోమవారం సాయంత్రానికి 99.16 శాతంతో పింఛన్ల పంపిణీ ముగిసినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ మాసానికి గాను మండలానికి 5,121 పింఛన్లు మంజూరుకాగా ఆ మొత్తాన్ని సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు 5,078 పింఛన్లు పంపిణీ చేయగా సంచార జీవనం చేస్తున్న, జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన 43 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

శ్రీశైలం రహదారిలో వాహనాల రద్దీ



డ్యాం దిగువ భాగంలో నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. సోమవారం అమావాస్య కావడంతో కన్నడ భక్తులు, సాధారణ భక్తులు వివిధ వాహనాలలో భారీగా తరలి వస్తున్నారు. లింగాల గట్టు నుంచి శ్రీశైలం డ్యాం వరకు వందలాది వాహనాలు ట్రాఫిక్ వల్ల నిలిచిపోయాయి. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఓంకారంలో నేడు ఉగాది పూజలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం, నవనందుల్లో ప్రముఖ క్షేత్రాలైన శివనంది, కృష్ణనంది ఆలయాల్లో మంగళవారం ఉగాది ఉత్సవం పూజలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా ఆలయాల్లో కొలువైన మూల మూర్తులకు విశేష అలంకరణ, పూజలు ఉంటాయన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మహానంది: ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయని, మండుటెండల్లో పనులు చేసే ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి కోరారు. తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం భార్గవి, ఆశ కార్యకర్త జయమ్మ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం రాత్రి మహా శివుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. డాక్టర్ నాగమైసూరి ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వాహనాల మళ్లింపు

ఆత్మకూరు: ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి భారీ స్థాయిలో వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆత్మకూరు నుంచి వాహనాలను ఇతర మార్గంలో మళ్లిస్తున్నట్లు ఆత్మకూరు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం నుంచి కర్ణాటకకు నల్లమల ఘాట్ రోడ్డులో వాహనాలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఆత్మకూరు నుంచి విజయవాడకు వెళ్లే లారీలు, ట్రక్కులు, భారీ వాహనాలను ఆత్మకూరు నుంచి గిద్దలూరు మీదుగా మళ్లిస్తామన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ వాహనాలను ఘాట్‌రోడ్డులో అనుమతించబోమన్నారు. ఇందువల్ల భారీ వాహనదారులు, ఇతర వాహనదారులు పరిస్థితిని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు, అర్చకులు ముందుగా అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి.. గణపతిపూజ, పుణ్యాహవాచనం, హారతి పూజలు చేపట్టారు. అనంతరం పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా చేపట్టారు.

శ్రీశైలంలో వీరశైవ భక్తులకు ప్రాధాన్యం

- శ్రీగిరితో వారిది విడదీయరాని బంధం
- మల్లన్నపై భక్తితో ఐక్యమైన అక్కమహాదేవి
- మల్లన్న స్వామికి నిత్య కైంకర్యాలు సమర్పించేది వీరశైవులే
- మల్లన్న ఆలయంలో వారే అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం వీరశైవులకు అత్యంత ప్రాధాన్యమైన క్షేత్రం. ఈ క్షేత్రంలో స్వయంభు లింగంగా వెలసిన శ్రీమల్లికార్జున స్వామి వీరశైవుల ఆరాధ్య దైవం. శ్రీశైల మహాక్షేత్రంతో వీరశైవులకు వీడదీయరాని అనుబంధం ఉంది. వీరశైవుల్లో అత్యంత ప్రముఖులైన పలువురు మల్లికార్జున స్వామివార్ల సేవలో సేవించి తరించారు. వీరిలో ప్రముఖులు అక్కమహాదేవి, సిద్ధరామేశ్వరుడు, హేమారెడ్డి మల్లమ్మకు ఎంతో విశిష్ట స్థానం ఉంది. మల్లికార్జున స్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు నిర్వహించేది కూడా వీరశైవులే.

మల్లికార్జున స్వామివారికి వీరశైవాగమ సారంగ నిత్య కైంకర్యాలు

శ్రీశైల మల్లికార్జున స్వామివారికి వీరశైవాగమ సారంగా ఆయా కైంకర్యాలను నిర్వహిస్తారు. మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులుగా వీరశైవులే పూజలు నిర్వహిస్తారు. శ్రీశైల దేవస్థానం వీరశైవ ఆగమ పాఠశాలను ఏర్పాటు చేసి అర్చకబోధన చేస్తున్నారు. ప్రతి ఏటా సుమారు 120మందికి పైగా అర్చకులు ఈ ఆగమ పాఠశాల నుంచి విద్యనభ్యసిస్తున్నారు.



శ్రీశైల ఆలయం



సిద్ధరామప్ప కొలను

అక్కమహాదేవి



12వ శతాబ్దంలో కన్నడ దేశంలో శివశరణులుగా ప్రసిద్ధి చెందిన మహాభక్తులలో అక్కమహాదేవి ఒకరు. వీరవిరాంగినిగా ప్రసిద్ధురాలైన ఈ భక్తురాలు శ్రీశైల మల్లికార్జున స్వామివారినే తన భర్తగా భావించి తరించింది. కర్ణాటకలోని ప్రస్తుత శివమొగ్గ జిల్లాలోని బల్లిగావి వద్ద గల ఉడుతడి గ్రామంలో సుమతి, నిర్మలశెట్టి దంపతులకు అక్కమహాదేవి జన్మించింది. అక్కమహాదేవి చిన్నతనం నుంచే ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీశైల మల్లికార్జున స్వామిని ఆరాధించసాగింది. అక్కమహాదేవి యుక్తవయస్కురాలయ్యాక అ ప్రాంత పాలకుడైన కౌశికుడు అక్కమహాదేవి అందాన్ని చూసి ఆమెను వివాహమాడాలని భావించాడు. అయితే శ్రీశైల నాథుడే తన సర్వస్వమని భావించిన అక్కమహాదేవి మల్లికార్జునుని తప్ప వేరొకరిని వివాహమాడనని చెప్పింది. అనంతరం అక్కమహాదేవి శ్రీశైల మల్లికార్జునునిలో ఐక్యం అవ్వాలని తన చిరకాల వాంఛతో శ్రీశైలం చేరింది.

రంగు రంగుల హామీల చంద్రబాబును నమ్మొద్దు

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో దోచుకున్నారు
- జగనన్న పాలనలో పైసా లంచం లేకుండా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు



కోటావీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రంగు రంగుల హామీలతో ఓట్ల కోసం వస్తున్న నారా చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మొద్దని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కోటా వీధిలో 18, 19 వార్డుల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశారని ప్రజలకు వివరించారు. మళ్లీ జగనన్న సీఎం కావాలని ఆశీర్వదించాలని కోరారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో బాబు వస్తే జాబు వస్తుందని యువతను చంద్రబాబు నేట్టట ముంచేశారన్నారు. మహిళలకు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తానని మోసం చేసిన ఘనత ఆయనకే దక్కిందని గుర్తు చేశారు. జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారన్నారు. సీఎం జగనన్న పాలనలో అర్హతలున్నా వారందరికీ లంచం లేకుండా పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రూ. 3 వేలు పింఛన్ ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమని చెప్పారు. రాష్ట్రంలోని పేద ప్రజలు క్షేమంగా ఉండాలంటే సీఎం వైఎస్ జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆశీర్వాదించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, కౌన్సిలర్లు లాలు, చిన్న రాజు, నాయబ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, గుర్రాల భాస్కర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, సతీష్‌కుమార్, మహేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజ్జి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపుపై హర్షం



బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని సన్మానిస్తున్న 80బన్నూరు గ్రామస్తులు

జూపాడుబంగ్లా: 80బన్నూరు గ్రామానికి చెందిన దళితుల శ్మశాన వాటిక నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పోయింది. దీంతో గ్రామానికి చెందిన మాల, మాదిగ, చెంచు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు అంత్యక్రియలకు స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటిరెడ్డి సహకారంతో విషయాన్ని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి విన్నవించారు. దీనిపై ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడగా.. ఆయన గ్రామంలోని సర్వే నంబర్ 126లో 2.22 సెంట్ల స్థలాన్ని మాల, మాదిగ, చెంచుల శ్మశానవాటిక కోసం కేటాయించారు. ఈ విషయమై సంతోషించిన గ్రామానికి చెందిన మాల, మాదిగ, చెంచు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు సోమవారం నందికొట్కూరులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, 80బన్నూరు గ్రామ సర్పంచ్ శ్యామలమ్మ, నాయకులు మద్దిలేటిరెడ్డి, సామేలు, మాల, మాదిగ, చెంచు సమాజిక వర్గాల కులసంఘాల పెద్దలు పాల్గొన్నారు.

అరటితోట దగ్ధం



అరటితోటలో మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి అనుకొని ఉన్న ఓ పొలంలో ఎండిన పొలం గట్లను రైతు అంటించాడు. కాగా వేసవి కావడం, గాలులు వీపరితంగా వీయడంతో మంటలు కాస్తా పక్కనే ఉన్న అరటి తోటకి వ్యాపించాయి. సుమారు 4 ఎకరాలలో అరటి చెట్లు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. వీటితో పాటుగా నీటి సరఫరా కోసం వేసుకున్న పైపులు, డ్రిప్ పైపులు మొత్తం కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి దగ్గర మంటలు చెలరేగడం గమనించిన గ్రామస్తులు వెంటనే మంటలను అర్పివేయడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయ్యింది. మంటలను గమనించపోయి ఉండింటే గ్రామంలోకి వ్యాపించి అస్తినష్టం జరిగేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కాగా అరటి పంట చివరిదశలో ఉండడంతో రైతుకు సుమారు పంటనష్టం రూ.1లక్ష, డ్రిప్ సిస్టం పూర్తిగా కాలిపోవడంతో రూ.1.50లక్షల దాకా నష్టం వాటిల్లిందని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం ఫ్యాన్‌కే ఓటేద్దాం

- అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్
- దేవనూరు, సున్నంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో డాక్టర్ దారా సుధీర్

మిడుతూరు: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడదామని నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి వైఎస్సార్‌సీపీ డాక్టర్ దారా సుధీర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలపరిధిలోని దేవనూరు, సున్నంపల్లి (మజరా గ్రామం) గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డికి ఒక ఓటు, ఎమ్మెల్యేగా డాక్టర్ దారా సుధీర్ మద్దతుగా ఒక ఓటు వేసి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వేయించి గెలిపించాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని దేవనూరు గ్రామానికి చెందిన చిన్న మౌలా, అన్వర్ బాషాతో పాటు ఆరీఫ్ అలీ, నారాయణ, రాజు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. డాక్టర్ దారా సుధీర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, గడప గడపకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓర్సు హరిత, ఎంపీటీసీ ఫరీదా, కో-ఆప్టెడ్ సభ్యులు మౌలా, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నాయకులు షరీఫ్ బాషా, సుంకిరెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



సూపరింటెండెంట్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

వెలుగోడు: సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకునేందుకు, వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా, శిల్పా చక్రపాణిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు వలంటీర్లు ముందుకు వచ్చారు. మేమంతా సిద్ధం అంటూ వలంటీర్ పోస్టులకు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఎలక్షన్ విధులతో పాటు ప్రభుత్వ పథకాల పంపిణీలో పాల్గొనొద్దంటూ ఈసీ ఆదేశాలు జారీ చేయడం, విపక్ష నేతల వైఖరితో మనస్థాపానికి గురై మండలంలోని రేగడగూడురు, వెలుగోడు గ్రామాలకు చెందిన 36 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ సయ్యద్ ఉమర్‌కు అందజేశారు. వలంటీర్లు అబ్దుల్‌వహీద్, నాగరాజు నాయక్, నవీన్, ప్రవీణ్, సద్దాం, కమాలి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: వెట్టి చాకిరీ వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. ఆత్మకూరు పట్టణంలో వివిధ వ్యాపార సముదాయాల వద్ద సీనియర్ సివిల్ జడ్జితో పాటు వివిధశాఖల అధికారులు బడిఈడు పిల్లలపై తనిఖీలు చేపట్టారు. సివిల్ జడ్జి మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను షాపుల్లో పనికి పెట్టుకోరాదన్నారు. హోటళ్లు, మెకానికల్ షాపుల్లో పని చేస్తున్న బాలకార్మికులను గుర్తించారు. వారికి విముక్తి కల్పించి తిరిగి బడికి పంపించాలన్నారు. అనంతరం వివిధ షాపులను పరిశీలించారు. పట్టణంలో ఎక్కడా బాలకార్మికులు షాపుల్లో పని చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ నీలిమసంధ్య, ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో దారా సుధీర్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దారా సుధీర్

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధారా సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన ముస్లిం సోదరులకు ప్రతి ఒక్కరికీ మందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉప సర్పంచ్ ఏసురత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సోమవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి పలు ప్రదేశాలను సందర్శించి, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రభోత్సవం జరిగే ఆలయవీధి, క్యూలైన్లు తదితరవాటిని పరిశీలించారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పార్కింగ్ ప్రదేశాలు, ఇతర రద్దీ ప్రదేశాలు, పాతాళగంగ, కాలిబాటమార్గం, క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ కంట్రోల్ రూంలోని సిబ్బంది పూర్తి అప్రమత్తతో ఉండాలన్నారు. ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలన్నింటినీ ఎటువంటి లోపం లేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు భక్తులతో సంభాషించి ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు



శ్రీశైలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీశైలం: శ్రీశైలం ఉగాది బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రఘువీరారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన శ్రీశైలంలోని నంది సర్కిల్, అవుటర్ రింగు రోడ్డు, కర్ణాటక బస్టాండు, కార్ పార్కింగ్ ప్రదేశాలు, పాతాళగంగ, మల్లికార్జున సదన్ సర్కిల్, టెంపుల్ పరిసరాలను పరిశీలించారు. బందోబస్తు విధులను నిర్వహించడానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసులకు పలు సూచనలు చేశారు. కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉత్సవాలకు కర్నూలు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి ఏడుగురు డీఎస్పీలు, 21 మంది సీఐలు, 56 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు 451 మంది వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, శ్రీశైలం టౌన్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న మల్లెల ధరలు



ఆత్మకూరు: ఉగాది, రంజాన్ పర్వదినం సందర్భంగా పట్టణంలో మల్లెల ధరలు ఊహించని విధంగా పెరిగాయి. సోమవారం కిలో రూ.800 నుంచి రూ.1000 చొప్పున విక్రయించడంతో మహిళలు ఇదెక్కడ ధర అంటూ వాపోయారు. మూర, రెండు మూరలు కావాలని కోరితే మూర రూ.50 నుంచి రూ.60 చొప్పున, రూ.100 రూ.120 చొప్పున విక్రయించడంతో అర మూరతో సర్దుకోవాల్సి వస్తోంది. బంతిపూలు సైతం కిలో రూ.200 విక్రయించారు. రూ.10, రూ.20కు పెట్టే చామంతిపూలు సైతం రూ.50 తక్కువకు విక్రయించడం లేదు.

సచివాలయ ఉద్యోగి ఔదార్యం



శ్రీనివాసరెడ్డి ఐరిష్ తీసుకుంటున్న సుహాసిని

మహానంది: బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన చేగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనారోగ్య కారణాలతో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోకాళ్ల ఆపరేషన్‌తో ఆయన ఆస్పత్రిలో ఉన్న విషయం కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న యర్రగుంట్ల సచివాలయం సిబ్బంది తిరుమల దర్శనానికి వెళ్లిన మహిళా పోలీసు సుహాసినికి విషయం తెలియజేశారు. దీంతో ఆమె వెంటనే స్పందించి ఆస్పత్రికి వెళ్లి తన లాగిన్‌లో లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసి తన సొంత డబ్బును పింఛన్‌గా అందించి మానవత్వం చాటుకున్నారు.

ఊపిరి ఉన్నంత వరకూ సిద్ధార్థరెడ్డి వెంటే

- వదంతులు నమ్మొద్దు
- వైఎస్సార్‌సీపీ పగిడ్యాల మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి



పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: పార్టీ నాయకుల్లో అంతర్గత విభేదాలు రాజేసేందుకు తాను టీడీపీ పార్టీలో చేరబోతున్నట్లు ప్రతిపక్ష పార్టీ శ్రేణులు పుకార్లు సృష్టిస్తున్నారని, ఊపిరి ఉన్నంత వరకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వెంటనే నడుస్తానని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి నవరత్నాలు పథకం అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. పిలిస్తే పలికే దైవంగా వరాలు కుమ్మరిస్తున్న జగనన్న వెంటే ఓటర్లు అందరూ ఉన్నారని, టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పార్టీ మారే ప్రసక్తే లేదని, మునిగిపోయే నావలో ఎవరైనా పయనిస్తారా అంటూ తీవ్రస్థాయిలో ఖండించారు. నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారని, దీనిని చూసి ఓర్వలేక ప్రజాదరణ కలిగిన నాయకులపై బురదజల్లేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి వదంతులను నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దని సిద్ధార్థరెడ్డి వెంటే నడుస్తామని ఆయన స్పష్టం చేశారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఓటర్లు వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, భూషిరెడ్డి, భాస్కరరెడ్డి, రాఘవ, మధు, బాబురెడ్డి, భాస్కర్, సుధాకర్, సురేష్, తదితరులు ఉన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో శిల్పా భువనేశ్వరరెడ్డి, నాయకులు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో సోమవారం రజక కుటుంబాలకు చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందని వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, నాగేంద్ర ఆధ్వర్యంలో నడిపి లింగమయ్య, శ్రీనివాసులు, నడిపి వెంకటేశ్వర్లు, చక్రపాణిరెడ్డితో పాటు 20 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మిక ఉత్సవాలు.. అబ్బురపరచిన విన్యాసాలు



అగ్నిగుండానికి పూజలు చేస్తున్న ఈఓ, పండితులు



పెదాలకు శూలం గుచ్చుకుంటున్న భక్తుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కొనసాగుతున్న ఉగాది మహోత్సవాలు అధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. ఉత్సవాలను కనులారా చూసిన కన్నడ భక్తులు ఆనందాలతో సంబరాలు చేసుకుంటున్నారు. సోమవారం లక్షలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు ప్రత్యేక పూజా హారతులిచ్చి, వాయనం సమర్పించారు. అనంతరం మల్లికార్జున స్వామివారి దర్శనానికి కన్నడ భక్తులు బారులు తీరారు. భక్తులందరికీ మల్లన్న అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పిస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా వీరాచార విన్యాసాలు

ఉగాది మహోత్సవాల్లో భాగంగా అమావాస్య ఘడియలను పురస్కరించుకుని అగ్నిగుండప్రవేశం, వీరాచార విన్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శివదీక్షాశిబిరాల వద్ద కార్యక్రమం కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు కల్పించింది. సంప్రదాయాన్ని అనుసరించి అర్చకస్వాములు అగ్నిగుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ ఒళ్లు గగ్గురుపుడిచేలా తాళ్లు, ఇనుపరాడ్లను నాలుకకు, శరీరానికి కుచ్చుకున్నారు. అనంతరం వివిధ రకాల విన్యాసాలు నిర్వహించారు. చివరిగా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.



వీరాచార విన్యాసాలు ప్రదర్శిస్తున్న వీరశైవులు